ప్రజాశక్తి
బుధవారం 18 జూన్ 2025
5
శ్రీ సత్యసాయి





◆ పావులు కదుపుతున్న వైస్‌చైర్మన్ బాబాయ్

◆ కౌన్సిలర్‌కు రూ.3లక్షలకు బేరం..!?

◆ మాజీ మంత్రుల గ్రూపుల మధ్య పోటాపోటీ

◆ పట్టుకోసం ఉషశ్రీచరణ్, మౌనంగా శంకరనారాయణ

◆ తన ప్రయత్నంలో మండల ప్రజాప్రతినిధి భర్త

కదులుతోన్న చైర్మన్ పీఠం

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పెనుకొండ కంచుకోట. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర రాజకీయ ప్రవేశం నుంచి ఇక్కడ టిడిపి ఎదురులేని విజయాలు సాధించింది. 2019 ఎన్నికల వరకు తెలుగుదేశం పెనుకొండలో ఓటమి ఎరుగలేదు. 2019లో వైసిపి తొలి సారిగా గెలు పొందింది. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం తిరుగు లేని ఆధిక్యం సాధించింది. పెనుకొండ మున్సిపాల్టీలో 20వార్డుల్లో 18 స్థానాలు వైసిపి గెలుచుని చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోవడంతో పరిస్థితి మొత్తం మారిపోయింది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పెనుకొండ నగరపంచాయతీ చైర్మన్ పీఠంపై కదులుతోంది.





కౌన్సిలర్‌కు రూ.3లక్షలకు బేరం.!?

చైర్మన్ ఉమర్‌ఫరూఖ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయన్ను ఆ స్థానం నుంచి దింపేందుకు వైస్‌చైర్‌పర్సన్ నందిని రెడ్డి బాబాయి కౌన్సిలర్లకు బేరంపెట్టినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క కౌన్సిలర్‌కు రూ.3లక్షలు ఇచ్చి తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే వాదన ఆ పార్టీ నేతల నుంచే విన్పిస్తోంది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు ఆయనకు మద్దతు తెలిపినట్లు సమాచారం.

పావులు కదుపుతున్న వైస్‌చైర్మన్ బాబాయ్ ..

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులున్నాయి. అందులో టిడిపికి కేవలం 2 వార్డుల్లో కౌన్సిలర్లు ఉన్నారు. మిగిలిన వార్డుల్లో వైసిపి అభ్యర్థులే విజయం సాధించారు. కాగా పెనుకొండ వైసిపికి సంబంధించి ఇద్దరు నాయకులు నాయకత్వం నడుస్తోంది. మాజీ మంత్రులు శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ వర్గాలకు చెందిన నేతలు ఆ పార్టీలో ఉన్నారు. ప్రస్తుత చైర్మన్ ఉమర్‌ఫరూఖ్ శంకరనారాయణ పెనుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన ఆశీస్సులతో చైర్మన్‌గా ఎన్నికైయ్యారు. 2024 ఎన్నికల్లో పెనుకొండ వైసిపి అభ్యర్థిగా ఉషశ్రీ చరణ్ రావడంతో ఆ పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇప్పటికీ ఈ రెండు గ్రూపుల మధ్య విభేదాలు నడుస్తూనే ఉన్నాయి. వైస్ చైర్మన్‌గా ఉన్న నందినిరెడ్డి బాబాయ్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈయనకు అండగా ఉషశ్రీ చరణ్ తెరవెనుక ఉండి నడిపిస్తున్నట్లు సమాచారం. మరో వైపు ప్రస్తుత చైర్మన్ ఉమర్‌ఫరూఖ్‌కు మద్దతుగా శంకరనారాయణ మద్దతుదారులు ఉన్నారు. ఈ రెండు గ్రూపులు చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు వారివారి దారుల్లో ప్రయత్నాలు చేస్తున్నారు.



అవిశ్వాసానికి నాలుగు నెలల సమయం

పెనుకొండ నగరపంచాయతీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టెందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఇంతలోనే ఎందుకు రచ్చ చేస్తున్నారని కొందరు వైసిపి ముఖ్య నాయకులు చురకలు వేసినట్లు సమాచారం. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాల్సిన నాయకత్వం ఇలా వర్గపోరుతో పార్టీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏది ఏమైనా పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ పీఠం కోసం వైసిపిలో మూడుముక్కలాటను తెలుగుతమ్ముళ్లు మౌనంగా వీక్షిస్తున్నారు. అవసరమైనప్పుడు 'అధికార' బలంతో రంగంలోకి దిగాలని వారు కూడా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

గ్రూపులుగా మాజీ మంత్రుల మద్దతుదారులు

పెనుకొండలో వైసిపి జెండా గెలుపునకు మాజీ మంత్రి శంకరనారాయణ కృషి ఉంది. 2024 ఎన్నికలకు ముందు ఆ పార్టీ అధిష్టానం శంకరనారాయణను పెనుకొండ నుంచి మార్చి అనంతపురం ఎంపి అభ్యర్థిగా పంపింది. ఇక కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఉషశ్రీచరణ్‌ను పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిపారు. ఉషశ్రీ చరణ్ రాకను శంకరనారాయణ మద్దతుదారులు వ్యతిరేకించారు. ఎన్నికల్లో కూడా ఈ రెండు వర్గాల మధ్య వైరం నడిచింది. ఇప్పటికీ అది కొనసాగుతూనే ఉంది. రెండు వర్గాల మధ్య నెలకొన్న వైరం కారణంగానే చైర్మన్ మార్పు అంశం తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. చైర్మన్ ఉమర్ ఫరూక్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించే అంశం శంకర నారాయణకు తెలిసినప్పటికీ ఆయన ఇప్పటికీ దీనిపై మౌనంగా ఉన్నారు.

మైనార్టీ కౌన్సిలర్‌కోసం చర్చలు

చైర్మన్ అంశానికి సంబంధించి పెనుకొండ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త పట్టణానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ మహ్మమద్ తయూబ్‌ను తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. ఆయన్ను ఎలాగైనా చైర్మన్‌ను చేయాలనే పట్టుదలతో వనరులు సమకుర్చుతున్నారనే చర్చలు సాగుతున్నాయి.

సాయం కోసం ఎదురుచూపు

◆ ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టం

◆ పంటనష్టానికి పరిహారం అందేదెన్నడో.?

◆ ప్రభుత్వంపై అన్నదాత ఆశలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి వైపరిత్యాలతో దెబ్బతిన్న పంట నష్టానికి సంబంధించి పరిహారం కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలోనైనా సాయం అందితే పెట్టుబడులకు ఊరట లభించనుంది. ఇది ఎప్పటికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. 2024 ఖరీఫ్‌లో ఆగస్టు వరకు వర్షాభావంతో ఆ తరువాత అధిక వర్షాలకు పంటల దెబ్బతిన్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన కూడా చేసింది. ప్రకటించిన కరువు మండలాలే చాలా తక్కువని, అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఆ తక్కువలోనూ నష్టపోయిన దానికి పరిహారం అందలేదు.

అనంతపురం జిల్లాలో..

అనంతపురం జిల్లాలో 2024 ఖరీఫ్‌లో ప్రభుత్వం ఏడింటిని కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందులో 14,116 మంది రైతులు పంటనష్టపోయారని అధికారులు తేల్చారు. దీనికి రూ.20.19 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. ఆ తరువాత అక్టోబరు, నవంబరు మాసాల్లో అధిక వర్షాల వల్ల 341 మంది రైతులు పంట నష్టపోయారు. దీనికి రూ.27.57 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. 2025 ఏప్రిల్‌లో అకాల వర్షాలతో నష్టం సంభవించింది. జిల్లాలో 2253 హెక్టార్లలో పంటనష్టం సంభవించింది. 1821 మంది రైతులకు రూ.16.83 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది.

సత్యసాయి జిల్లాలో..

సత్యసాయి జిల్లాలో 2024 ఖరీఫ్‌లో సంభవించిన కరువు కారణంగా 46,836 హెక్టార్లలో నష్టం సంభవించింది. దీనికి సంబంధించి రూ.62.46 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. అక్టోబరులో అధిక వర్షాల వల్ల 562 హెక్టార్లలో పంటనష్టం సంభవిస్తే దానికి రూ.49.11 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. నవంబరు నుంచి మే వరకు అకాల వర్షాలతో 284 హెక్టార్లలో పంటనష్టంకు రూ.19.09 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. రబీలో వర్షాభావం ఏర్పడినందుకు 1419 హెక్టార్లలో పంటనష్టానికి రూ.1.21 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. ఈ ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలి

ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలి. ఇవి చేస్తే ఈ ఏడాది పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడులకైనా డబ్బులు రైతులకు అందుతాయి. ఇప్పటికే గతేడాది నుంచి రైతుకు ప్రభుత్వపరంగా అందుతున్న సాయం శూన్యంగా ఉంది. నష్టపోయిన రైతుకు సకాలంలో సాయం అందించి ఆదుకోవాలి.

హరి
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

మెగా లోక్‌అదాలత్ విజయవంతానికి సహకరించండి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానాల ఆదేశం మేరకు జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. మంగళవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, హిందూపురం డీఎస్పీ వీకే మహేష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ల వారీగా రాజీ కాదగిన క్రిమినల్ కేసులను సాధ్యమైనంత అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని న్యాయశాఖ పరంగా అందిస్తామని తెలిపారు. అలాగే న్యాయవాదులు చెక్ బౌన్స్, భరణం, వివాహ సంబంధ కేసులతో పాటు సివిల్ కేసులు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కేసుల రాజీ విషయంలో కక్షదారులను ఒప్పించేందుకు న్యాయవాదులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇందుకోసం ముందుగానే ప్రీ లోక్ అదాలత్ కూడా నిర్వహిస్తామని ఏడిజే తెలిపారు. కేసుల పరిష్కారం తమ పరిధిలో కాకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకురావాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, ఎస్ఐలతో న్యాయవాదులు నాగప్ప, రామిరెడ్డి, మురళి, అభిలాష్ లతోపాటు ఆయా న్యాయస్థానాల సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు



స్టాప్ డయేరియా పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్

డయేరియాను నిర్మూలిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో డయేరియా లేకుండా చేసేలా ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. డయేరియా క్యాంపెయిన్ పోస్టర్లు, కరపత్రాలను కలెక్టరేట్‌లో మంగళవారం నాడు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు డయేరియాకు సంబంధించి మరణాలు సంభవించకుండా ఉండేలా ఈనెల జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వీటిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా

జిల్లాలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు నిబంధనలకు లోబడి వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని ఆ జాబితాను ఇవ్వాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలను అనుసరించి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని తెలియజేశారు. బూత్ లెవెల్ ఏజెంట్లు ఆ ప్రాంతంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ విజయ సారధితో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతికి రక్షణ ఇద్దాం

◆ దాన్ని సంరక్షిస్తే...అది మనల్ని సంరక్షిస్తుంది..

◆ ప్రపంచ ఎడారి నివారణ దినోత్సవంలో వక్తలు

◆ ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో సదస్సు



మాట్లాడుతున్న ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'మానవుడు ప్రకృతికి యజమాని కాదు... ధర్మకర్త మాత్రమే' అని అలాంటి ప్రకృతిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని పంగల్ రోడ్డు వద్దనున్న ఆర్డీటీ ఇన్‌క్లూజీవ్ హైస్కూల్ ఆవరణంలో 'ప్రపంచ కరువు, ఎడారి నివారణ దినోత్సవం'ను మంగళవారం నిర్వహించారు. ప్రకృతి సంరక్షణ, ఎడారి నివారణ కార్యక్రమాలకు సంబంధించి పొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి మానవుడు యజమాని కాదని.. ధర్మవ కర్త మాత్రమే అన్నారు. ప్రకృతిలో అసమతుల్యత ఏర్పడటం ద్వారా నేడు అనేక విపరిణామాలను ఎదుర్కొకావాల్సి వస్తోందన్నారు. జిల్లా రెవన్యూ అధికారి మలోల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుపై ఆసక్తి పెరిగిందన్నారు. వ్యవసాయ పరిశోధాన సంస్థ ప్రన్సిపాల్ సైంటిస్టు విజయ శంకర్ బాబు మాట్లాడుతూ హరిత విప్లవం తరువాత దిగుబడులు పెంచే క్రమంలో పెద్దఎత్తున రసాయనాల వాడకం పెరిగిందన్నారు. తద్వారా భూమి, నీరు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం పడుతోందన్నారు. కరువు అన్నది తక్కువ వర్షపాతం నమోదవడమే కాదు... భూసారాన్ని కూడా దెబ్బతీస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ లక్ష్మానాయక్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలియజేశారు. నీరు, మట్టి, కొండలను కాపాడటం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడగలమని ఎఫ్ఇఎస్ హెడ్ భక్తర్ వలి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ డైరెక్టర్ భానుజ, జిల్లా ఉద్యానవన అధికారి సుబ్రమణ్యం, ఎఆర్ఎస్ సైంటిస్టు మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళా డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో శక్తి బృందాలు జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రజలకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రద్దీ ప్రదేశాలలో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, షాపింగ్ కాంప్లెక్స్ ,ముఖ్యమైన ప్రదేశాలలో పర్యటిస్తూ మహిళలు బాలికలకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. శక్తి యాప్ ఆవశ్యకత, దాని ద్వారా అందించే సేవలు, నిక్షిప్తం చెయ్యబడిన సమాచారం, రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం తదితర విషయాల గురించి వివరించారు. శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

కూ(టి)లి కోసం...!

ప్రజాశక్తి - రొద్దం

గ్రామాల్లో అనేక కుటుంబాలు తమ కుటుంబపోషణ కోసం నానాపాట్లు పడుతుంటారు. ప్రమాదమని తెలిసినా కుటుంబపోషణ కోసం నానాపాట్లు పడుతుంటారు. అలాంటి దృశ్యం మంగళవారం రొద్దం మండలంలో ప్రజాశక్తి కంటపడింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో పొలం పనులకు వెళ్లడానికి ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి కూలీలు వెళుతుంటారు. రొద్దం నుంచి పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో మూడు చక్రాల వాహనంలో దాదాపు 30 మంది వరకు కూలీలు ఒకే గ్రామానికి చెందిన నలుగురు రైతుల పొలాల్లో పనిచేయడానికి వెళ్లారు. చిన్న వాహనంలో అధిక సంఖ్యలో కూలీలను తరలించడం ప్రమాదంతో కూడుకున్న పని. ప్రమాదమని తెలిసినా కూలి కోసం మహిళలు ఆ వాహనంలో అధికసంఖ్యలో వెళ్లారు.



లగేజీ ఆటోలో కూలి పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్తున్న మహిళా కూలీలు



పాంచజన్య శ్రీనివాసులను ప్రెస్‌క్లబ్ లో సన్మానిస్తున్న పాత్రికేయులు

పాత్రికేయులకు అండగా ఉంటా..

పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో వివిధ పత్రికలు, చానల్స్ లో పని చేస్తున్న పాత్రికేయులకు అన్ని విధాల అండగా ఉంటానని పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. పాంచజన్య శ్రీనివాసులు 70వ జన్మదినం సందర్భంగా మంగళవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. శ్రీనివాసులు చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి పలువురు వివరించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతు జర్నలిస్టులకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రీయాజ్, నందకుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, ఆర్గనైజింగ్ ప్రెసిండెంట్ షబ్బీర్, సీనియర్ పాత్రికేయులు చంద్ర శేఖర్ రెడ్డి, ప్రకాష్, ఫణి కుమార్, అల్లీ పీరా, రమేష్, రాజేష్, ప్రకాష్, ప్రదీప్, సాయి చరణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావంగా నిలుద్దాం : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇజ్రాయిల్ బీకర దాడుల్లో ఆస్తులు, ప్రాణాలు సర్వం కోల్పోతున్న పాలస్తీనాకు ప్రతి ఒక్కరూ సంఘీభావంగా నిలవాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అనంతపురం టవర్ క్లాక్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో దాదాపు 60 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. వీరిలో అత్యధిక మంది చిన్నారులు, మహిళలు ఉన్నారని తెలిపారు. ఇజ్రాయిల్ ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండడం అత్యంత బాధాకరం అన్నారు. ఇజ్రాయిల్ దేశం ఒక జాతిని సమూలంగా నాశనం చేసే విధంగా పాలస్తీనాపై దాడులు చేస్తోందన్నారు. ఇజ్రాయిల్ చర్యలను ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, సామాజిక కార్యకర్తలు, మానతావాదులు ఖండిస్తున్నా ఏమాత్రం లెక్క చేయడం లేదన్నారు. చిన్న పిల్లలపై చేస్తున్న దాడిని ఇజ్రాయిల్ ప్రభుత్వంలోని మంత్రులు సమర్థించుకోవడం మరింత క్రూరమైన చర్య అన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న ఈ దాడిపట్ల భారత ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. ఇజ్రాయిల్‌పై భారత్ మెతక వైఖరిని అవలంభించడం సరికాదన్నారు. వలసవాద వ్యతిరేక సంఘీభావం, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతునిస్తూ భారత్ సుదీర్ఘ కాలంగా అనుసరిస్తూ వచ్చిన వలసవాద వ్యతిరేక, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే విదేశాంగ విధానం నుంచి వెనక్కు తగ్గడం సిగ్గుచేటని విమర్శించారు. పాలస్తీనా ప్రయోజనాలకు ఇప్పటివరకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని కోరారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజలు పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట నారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, నగర్ కమిటీ సభ్యులు బాలకృష్ణ, రాజు, ఎన్టీఆర్ సీనా, లక్ష్మీనారాయణ ఎర్రిస్వామి, ఇస్మాయిల్, ఆది, ఆజాం, రామలింగారెడ్డి, రామాంజనేయులు, శంకర, మనీ, ఇజ్రాయిల్, ప్రసాద్, వలీ, సిద్దు, వెంకటేష్, రియాజ్ పాల్గొన్నారు.



పాలస్తీనాకు సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



నోటు పుస్తకాల పంపిణీలో పాత్రికేయులు

జర్నలిస్టుల పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఎపిడబ్ల్యూజెఎఫ్ ధర్మవరం డివిజన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు మజ్జిగ భాస్కర్, ఉపాధ్యక్షులు భాస్కర్ గౌడ్, కోశాధికారి వెంకటేష్ చౌదరి మాట్లాడుతూ విలేకరుల సంక్షేమానికి యూనియన్ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గాండ్లపెంట ఏవోగా సయ్యద్ షాదబ్

ప్రజాశక్తి - గాండ్లపెంట

గాండ్లపెంట మండల ఎఒగా సయ్యద్ షాదాబ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తలుపుల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ ప్రియ నల్లచెరువు మండలానికి బదిలీపై వెళ్లారు ఈ సందర్భంగా ఏవో సయ్యద్ షాదాబ్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలోని శ్రీకంఠాపురంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నిర్మాణంలో భాగంగా దేవాలయానికి అవసరమైన గ్రానేట్ ను టిడిపి నాయకులు మంగేష్ వితరణగా అందజేశారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ ల సమక్షంలో దేవాలయానికి అవసరమైన 12 చదరాల గ్రానేట్ ను ఆలయ కమిటీ చైర్మన్ ఉదయ్ కుమార్, గ్రామ పెద్దలు ఆదెప్ప, మేకల నరసింహప్ప, గంగప్ప, గంగాధరప్ప, రమేష్ లకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మయ్య, కౌన్సిలర్ గిరీష్ కుమార్, వెంకటేష్, లింగేష్, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - నల్లమాడ

పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని తెలుగుదేశం పార్టీ పరిశీలకులు రొద్దం నరసింహులు సూచించారు. మండల కేంద్రంలోని టిడిపి నాయకులు బాల రాజారెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు రొద్దం నరసింహులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ గ్రామ కమిటీలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీ కన్వీనర్లు, అనుబంధ కమిటీలు పార్టీ అభివృద్ధికి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొట్లో మంజూరెడ్డి, మండల కన్వీనర్ మైలే శంకర, రమణారెడ్డి, గన్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, బి రమణారెడ్డి, మైలే రామచంద్ర, కేశవరెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని బ్రహ్మసముద్రం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ వెంకటలక్ష్మి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని, సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గోవింద నాయక్, పాఠశాల సిబ్బందితో పాటు తెలుగుదేశం నాయకులు కురుబ ఆదినారాయణ, డీలర్ రామంజి, నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గం పరిధిలోని రోళ్ల మండలం కేంద్రంలోని కెజిబివిలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికర సమితి కన్వీనర్ పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు విమర్శించారు. స్థానిక ధర్మవరం రోడ్డులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' అనే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు, అశాంతి వాతావరణం నెలకొందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు తీవ్ర వైఫల్యం చెందారన్నారు. వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరసింహారెడ్డి, ఎల్లప్ప, మధు, వెంకటరాముడు, బళ్లారి బాబు, కృష్ణమూర్తి, మారుతి, వెంకటేశు,ఆంజనేయులు , రాము, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు



అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కొత్తచెరువు

బుక్కపట్నంలో అర్ధాంతరంగా ఆగి ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం డిగ్రీ కళాశాల ఆగిపోయిన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు సంవత్సరాల కిందట వీటిని నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 3.92 ఎకరాల భూమిని కేటాయించి మూడు కోట్ల రూపాయల నిధులను కేటాయించిందన్నారు. అయితే అప్పట్లో కేవలం రూ.59 లక్షల నిధులను మాత్రమే విడుదల చేసిందన్నారు. దీంతో భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వినాయకులు తరుణ్ ,వెంకీ, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పాంచజన్య' వార్షికోత్సవం



సన్మాన కార్యక్రమంలో పాంచజన్య శ్రీనివాసులు, సీనియర్ ఉపాధ్యాయులు, సిబ్బంది

ప్రజాశక్తి- హిందూపురం

పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాల 23వ వార్షికోత్సవ వేడుకలతో పాటు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు 70వ జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల నడుమ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రీయాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10 సంవత్సరాలు విధులు నిర్వహించిన సిబ్బందికి సన్మానించి, నగదు బహుమతులు అందించారు. అనంతరం పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ 22 సంవత్సరాల క్రితం ఒక ఆశయంతో పాఠశాలను స్థాపించడం జరిగిందన్నారు. నాటినుంచి నేటి వరకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవలో సైతం వారిని భాగ్యస్వాములు చేసి సమాజాభివృద్ధికి సైతం ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. యోగా, వ్యాయామ, గేమ్స్, స్పోర్ట్స్ లో సైతం తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాలకు అనుసందానంగా ట్రస్టును ఏర్పాటు చేసి మంచి మార్కులు సాధించిన విద్యార్థుల ఉన్నత విద్యకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు సందీప్, సెక్రటరీ నందకుమార్, స్కూల్ డైరెక్టర్లు భారతి శ్రీనివాస్, సత్య, అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్ స్మితకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ నందిత సందీప్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర

లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం పంపిణీ చేశారు. 32మందికి మంజూరైన రూ.. 13.46లక్షల విలువైన చెక్కులను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయి బ్రాహ్మణ సాధికారిక జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, డీలర్లు సోమశేఖర్, చంద్ర రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, లబ్ధిదారులు

ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో, ఇష్టపడి విద్యాభ్యాసం సాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాండు రంగనాయకులు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాలకు వందేళ్ళకు పైబడి చరిత్ర ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు విదేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని మంచి స్థానం పొందాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, నిఘంటువులు, బెల్టులు తదితర విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాల పంపిణీలో చైర్మన్, ఎంఇఒ, తదితరులు

రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ సురేంద్ర నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

రైతులు నిరంతరం ఒకే రకమైన పంటను సాగు చేసి నష్టాలకు గురి కాకుండా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చలివెందల, బాలంపల్లి గ్రామాల్లో వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వేసవి దుక్కుల వల్ల ఉపయోగాలు, మొక్కజొన్న లో విత్తనశుద్ధి, కలుపు యాజమాన్య, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం , కత్తెరపురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని అధికం చేయాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం, యాంత్రీకరణ తదితర వాటి గురించి రైతులకు వివరించారు. పశుసంవర్ధక అధికారి డాక్టర్ రాధిక మాట్లాడుతూ, ఈ సీజన్ లో పశువులలో వచ్చే రోగాలు, వాటి నివారణ గురించి పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పుష్పలత, స్వప్న, రమ్యకృష్ణ, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని నల్లగొండ్రాయనపల్లి, చాకర్లపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన సమావేశాలలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కు సంబంధించి పెండింగ్ లిస్టులో ఉన్న రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ ,మొక్కజొన్న పంటల సాగు మెలుకువలు సూచించారు. పట్టు పరిశ్రమ శాఖ కు సంబంధించి పట్టుపురుగుల పెంపకానికి ట్రైప్ వన్ షెడ్లు రాయితీపై ప్రభుత్వం ఇస్తుందనిఆసక్తిగల రైతులు సెరికల్చర్ అధికారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేశులు, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ , మాజీ ఎంపీటీసీ క్రిష్టప్ప, రైతు సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, శ్రీరాములు, ఏఈవో అలేఖ్య ,సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, విహెచ్ఎలు సబిహా, బాబావలి తదతరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్ పేర్కొన్నారు . హరిత నేస్తం నిర్వాహకులు రాయసం హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం కదిరి ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసు ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుర్రప్ప, ఫారెస్ట్ సిబ్బంది మరియు 1981 పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల ప్రతినిధి చలపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున మొక్కలు నాటి ఆదర్శంగా మారాలన్నారు. అనంతరం హరిప్రసాద్ తన స్వంత నిధులతో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. పూర్వ విద్యార్థి కె. మునీర్, కె.వి.రమణ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



మొక్కలు నాటుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

సబ్సిడీ పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో మంత్రి పాడి రైతులకు సబ్సిడీ దాణాను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రోటీన్లతో కూడిన దాణాను పశువులకు అందించడం ద్వారా మెరుగైన పాల ఉత్పత్తిని సాధించవచ్చన్నారు. పెనుకొండ మండలానికి 197 దాణా ప్యాకెట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఒక్కొక్క బస్తా రూ.1,100 కాగా సబ్సిడీ 50 శాతం రూ.550 ధరతో రైతులకు అందజేస్తున్నారన్నారు. ఇందులో 25శాతం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించామని వివరించారు. పశు పెంపకదారులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 37 గోకులం షెడ్ లు, 43 నీటి తొట్టెలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, డిడి గిరిజ, ఏడి జయరాం నాయక్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, టిడిపి పట్టణ మండల కన్వీనర్లు శ్రీరాములు యాదవ్ ఈశ్వర ప్రసాద్ మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద సి ఎన్ బి కళ్యాణ మండపం సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు నిమ్మూరి ఆంజనేయులు (43) మృతి చెందాడు. ఆంజనేయులు మగ్గాలకు జాకార్డులు కడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో జా కార్డులు కట్టడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. సిఎన్‌బి కళ్యాణ మండపము వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కిందికి పడ్డాడు. అదే సమయంలో ధర్మవరం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆంజనేయులుపై వెళ్లింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో మృతుని భార్య సరోజమ్మ చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ఆకాష్ విజయవాడలో బిటెక్ చదువుతుండగా రెండవ కుమారుడు అభిరామ్ ఈ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమిళనాడు కి చెందిన పశువులను తరలించే లారీని ఆపి పోలీసులమని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు . కదిరి పట్టణం కుట్టగుళ్ల వద్ద ఈనెల 15న రాత్రి సమయంలో తాము పోలీసులు అని చెప్పి లారీ డ్రైవర్ వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేశారని డ్రైవర్ మారుద ముత్తు అర్చామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటాగుల గ్రామానికి చెందిన పొట్టెండ్ల నాగభూషణ, భుక్యా ఆంజనేయులు నాయక్, రాజీవ్ గాంధీ నగర్ కి చెందిన మందల కుల్లాయప్ప అనే నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి బొలెరో వాహనాన్ని, పశువుల లారీ డ్రైవర్ వద్ద లాక్కున్న రూ.5,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వెల్లడించారు. నిందితులను కదిరి కోర్టులో హాజరు పరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా,వారిని కదిరి సబ్ జైలుకు తరలించామన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో స్పోర్ట్స్ మెటీరియల్ వాటి వివరాలపై మంగళవారం జిల్లా విజిలెన్స్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరా తీశారు. ఖర్చు, మిగులు బడ్జెట్ పై అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు తమ నివేదికలు సమర్పిస్తే వాటినిజిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో పార్థసారథి, విజిలెన్స్ అధికారులు వాసుప్రకాష్, కానిస్టేబుల్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని తిమ్మమ్మ మర్రిమానులో ఈ నెల 21 వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం గూటిబైలు ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో మండల అధికారులతో సమీక్షా నిర్వహించారు. యోగా నిర్వహించే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు,అన్ని సచివాలయాల సిబ్బంది,కూటమి నాయకులు తమ గ్రామాల్లోని ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. శనివారం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్ నాయక్, ఈవోఆర్డీ మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ, జూనియర్ సహాయకులు సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి బత్తలపల్లి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బత్తలపల్లి బ్రాంచ్ మేనేజర్‌గా కొంకా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం బత్తలపల్లి బ్రాంచ్ లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో స్టేట్ బ్యాంకు నందు పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని రైతులకు సూచించారు. పంట రుణాలు పొందిన రైతులు గడువులోగా రుణాలు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలేని రుణం, బీమాకు అర్హులవుతారన్నారు. స్టేట్ బ్యాంకు నుండి వివిధ రకాల రుణాలు పొందిన వారు సకాలంలో అప్పులు చెల్లిస్తే మరింత మందికి రుణాలు ఇవ్వవచ్చునని పేర్కొన్నారు.

'తల్లికి వందనం'పై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

తల్లికి వందనం పథకం అమలుపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో సాయి మనోహర్, ఎంఇఒ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ తల్లికి వందన కార్యక్రమం అందరికీ లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. రేషన్ కార్డు, జీఎస్టీ, టాక్స్ నాలుగు చక్రాల వంటి సమస్యలు ఉన్న యెడల సచివాలయంలో గ్రామ కార్యదర్శి వెల్ఫేర్ సహాయకులు డిజిటల్ సహాయకులు సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండలం పరిధిలోని ఆయా సచివాలయాల వెల్ఫేర్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అందరి బాధ్యత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం బాధ్యతగా భావించాలని విశ్వదేపా సేవా సంఘం వ్యవస్థాపకులు కోళ్లమోరం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం ను పురస్కరించుకొని మంగళవారం తమ కార్యాలయంలో అత్యధిక రక్తదానం చేసిన వారందరికీ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం మరో ఇరువురికి ప్రాణదానం అవుతుందని తెలిపారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా రక్తదానం ఉంటుందని తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొని వారికి పునర్జన్మ కల్పించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గాజుల సురేష్‌తో పాటు చంద్ర, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాధవ, జుజర్ రఘు, నారాయణస్వామి, మధుసూదన్ నాయుడు తదితర సభ్యులు పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న భాష్యం పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, యూనిఫాం తదితర విద్యాసామాగ్రి పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేల రూపాయల వసూలు చేస్తున్నారని విమర్శించారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి హిందూపురం

పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న హెచ్ నాగరాజు (48) విధి నిర్వహణ సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఆర్టీసీ డ్రైవర్ నాగరాజు విధి నిర్వహణలో భాగంగా హిందూపురం- విజయవాడ బస్సు కు డ్రైవర్ గా వెళ్ళాడు. విజయవాడ నుండి హిందూపురం వస్తుండగా మంగళవారం తెల్లవారుజామున తాడిపత్రికి వచ్చిన సమయంలో ఛాతిలో నొప్పి రావటంతో ఇబ్బంది పడ్డాడు. మరో డ్రైవర్ కు తన పరిస్థితిని వివరించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగరాజును వెంటనే అక్కడి ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడు. మంగళవారం సాయంత్రానికి నాగరాజు మృతదేహాన్ని హిందూపురానికి తీసుకొచ్చారు. ఆర్టీసీ అధికారులు ఉద్యోగులు నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.